



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 102 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 22 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 102 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 22 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడు

- తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ దోషులను కఠినంగా శిక్షిస్తామన్న సీఎం
- అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ పై వైసీపీ నిందలు
- అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైసీపీ బూతుల పార్టీనేనని విమర్శ
- రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యతలో ప్రజలు కలిసిరావాలని పిలుపు
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయిమయం చేసిందని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మహా పాపానికి పాల్పడిన నిందితులను నడిరోడ్డుపై నిలబెట్టి శిక్షిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. వారి కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోవడానికే ఇప్పుడు హెరిటేజ్ సంస్థపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2024కు ముందు తిరుమల దర్శనానికి వెళ్లిన ప్రతి భక్తుడికి లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గిపోయిన విషయం అనుభవంలోకి వచ్చిందన్నారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదని, కానీ గత పాలకులు దాన్ని అపవిత్రం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "వారు కొనుగోలు చేసిన నెయ్యి నమూనాలను గుజరాత్‌లోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకు (ఎన్డీడీబీ) పరీక్షల నిమిత్తం పంపిస్తే, అది అసలు నెయ్యే కాదని, అందులో జంతువుల కొవ్వు కలిసిందని ల్యాబ్ నివేదిక ఇచ్చింది. దీనిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సెట్) సైతం తన నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది. సరఫరా చేసింది నెయ్యి కాదని, కేవలం రసాయనాలతో తయారు చేసినట్లు తేల్చింది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ తప్పును తాము బయటపెడుతుంటే, దొంగే దొంగా అని అరిచినట్లుగా తిరిగి ప్రభుత్వంపైనే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు.

**నాటకాల రాయుళ్లది రోజుకో వేషం**

వివేకానంద రెడ్డి హత్య ఘటనను ప్రస్తావిస్తూ... ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడని, చివరకు తన చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేలా నాటకాలు రక్తి కట్టించాడని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. అలాంటి వారే ఇప్పుడు తిరుమల నెయ్యి విషయంలోనూ

- మిగతా 2లో



## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం
- దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించారని తీవ్ర విమర్శ
- ప్రతిష్టాత్మక వేదికలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న లోకేశ్
- ఆవిష్కరణలపై దృష్టిపెట్టి దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపు

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న

- మిగతా 2లో



## 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

### మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో

వెంకయ్యనాయుడు ఆందోళన

- విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాలన్న మాజీ ఉప రాష్ట్రపతి
- మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వెంకయ్యనాయుడు
- భారత్ విశ్వగురువు అయినా ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదన్న వెంకయ్యనాయుడు

- మిగతా 2లో

## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు..

### నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

- పార్టీ నేతలతో నాదెండ్ల మనోహర్ టెలీకన్ఫరెన్స్
- క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచన
- జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలన్న నాదెండ్ల



పెన్ పవర్ డెస్క్:జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం

- మిగతా 2లో



## ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

- ఏపీబీసీఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసిన సీఐడీ
- ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలు చోరీ చేశారంటూ కేసు నమోదు
- ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న వాసుదేవరెడ్డి

పెన్ పవర్ డెస్క్:ఏపీ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసు కుంది. తాజాగా మరో అరెస్ట్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) మాజీ ఎండీ,

- మిగతా 2లో



## వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది

- తిరుమల లడ్డూపై చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారన్న మల్లాది విష్ణు
- సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లుతున్నారని మండిపాటు
- ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని వ్యాఖ్య

- మిగతా 2లో

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- అక్రమ వలసదారులను ఓటరు జాబితా నుంచే కాదు దేశం నుంచి తొలగిస్తామన్న అమిత్ షా
- అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్న అమిత్ షా
- కానీ కాంగ్రెస్‌కు వారే ఓటు బ్యాంకు కాబట్టి పంపించలేరని విమర్శ



పెన్ పవర్ డెస్క్:నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదా రులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని,

- మిగతా 2లో




## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం
- ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం
- సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన
- ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు
- ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం


పెన్ పవర్ డెస్క్:ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంత ర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచిం ది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించు కోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని

- మిగతా 2లో

## కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

- కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- కబ్జాకు గురైన పార్కులు, ప్రజావసరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా
- ఆక్రమణలు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు
- కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం
- దశాబ్దాల సమస్య పరిష్కారమవడంతో స్థానికుల ఆనందం

- మిగతా 2లో




## భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

- యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు... జైషే అంతర్జాతీయ కుట్ర!
- పబ్‌లు, క్లబ్బుల్లో దాడులకు యువతులను నియమించుకుంటున్న ఉగ్రసంస్థ
- పాక్ ప్రమేయం బయటపడకుండా విదేశీ మహిళల నియామకం
- గాజా సహాయం పేరుతో దాడులకు భారీగా నిధుల సేకరణ
- ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరపాలని ప్లాన్

- మిగతా 2లో



## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

### ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన



- ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన
- పరీక్షలు బాగా రాయలేననే ఆందోళన వద్దన్న కవిత
- పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య

- మిగతా 2లో



## మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా

- మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి నేడు
- 2022 ఫిబ్రవరి 21న గుండెపోటుతో మృతి చెందిన గౌతమ్ రెడ్డి
- గౌతమ్ రెడ్డిని స్మరించుకున్న జగన్

పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధం తి నేడు. ఈ సందర్భం గా తన స్నేహితుడు గౌతమ్ రెడ్డిని వైసీపీ అధినేత జగన్ స్మరించుకున్నారు.

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# బుర్రకథా పితామహుడు నాజర్

ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. " ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్.నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం"లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృత్తాలలో నమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు.అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు.ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై "నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు."నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్‌టిఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... "నేను మీ ఫాన్‌ను" అని ఎన్‌టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. "హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితరప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- మొదటి పేజి తరువాయి

నిర్దేశిస్తాం ది.'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

**ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.**

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ (Democratising AI Resources)
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు (Economic Growth and Social Good)
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ (Secure and Trusted AI)
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ (AI for Science)
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత (Access for Social Empowerment)
6. మానవ వనరుల అభివృద్ధి (Human Capital Development)
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు (Resilient, Efficient and Innovative AI Systems)

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడు

- మొదటి పేజి తరువాయి

అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. మసీదు, చర్చి, దేవాలయం ఏదైనా వాటి పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే టీటీడీలో ప్రక్షాళన ప్రారంభించామని తెలిపారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు వెంకటేశ్వర స్వామి ఫొటోలను చెప్పులతో పట్టుకుని, సభలో రాజకీయం చేసి, ఆ తర్వాత ఫొటోలను అక్కడే పడేసి వెళ్లారని, వారికెందుకు ఇంత అహంకారమని ప్రశ్నించారు.

**అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అది బూతుల పార్టీనే**

వైసీపీ నేతల భాషపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గతంలో అసెంబ్లీలో నా భార్యపై అత్యంత నీచంగా మాట్లాడి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆ పార్టీ బూతులు మాట్లాడటం మాత్రం మానలేదు. ఆబోతుల మాదిరిగా తయారై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. వారితో తిట్టించుకోవడానికే మనం రాజకీయం చేస్తున్నామా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు, రౌడీ రాజకీయాలు చేస్తున్నారని, పరామర్శల పేరుతో వెళ్లి అమాయకులను తమ కార్ల కింద తొక్కించి చంపుతారని, కానీ వారిని పరామర్శించరని విమర్శించారు.

**రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేశారని, పరిశ్రమలను తరిమికొట్టి ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న నమ్మకాన్ని పోగొట్టారని చంద్రబాబు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, భవిష్యత్ ఆదాయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు.
గత పాలకులు రాష్ట్రాన్ని గంజాయిమయం చేశారని, తమ ప్రభుత్వంలో మత్తు పదార్థాలు సేవించి ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందనే భయంతోనే మదనపల్లి అత్యాచార కేసులో నిందితుడు ఆత్మహత్య
చేసుకున్నాడని గుర్తుచేశారు. శాంతిభద్రతలకే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. చెడును నిరాకరించే శక్తి ప్రజల్లో వచ్చినప్పుడే రాజకీయ ప్రక్షాళన సాధ్యమవుతుందని, రాష్ట్రాన్ని కాపాడుకునే ఈ బృహత్కార్యంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకె ళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రా ష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు. భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వారు ఓడిపోయారని వెల్లడించారు.
సమాజం కూడా అలాంటి వాళ్లను బహిష్కరించాలని హితవు పలికారు. రామాయణాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు.
తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలు తమ పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి దానికి గూగుల్ మీద ఆధారపడుతున్నారని, కానీ వారు దీనిని పక్కన పెట్టి బుర్రకు పని చెప్పాలని సూచించారు.

# ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు..

- మొదటి పేజి తరువాయి

ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

# వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది

తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారని, రాష్ట్రానికి పెద్దగా, బాధ్యతగా ఉండాల్సిన వ్యక్తి స్థానానికి ఇది తగదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని సీబీఐ సిట్ చార్జ్ షీట్ లో తెలిపిందని విష్ణు అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసేందుకు కుట్ర పన్నారని... సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లడం మానుకోలేదని దుయ్యబట్టారు. నెయ్యి వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని... వారికి తగ్గట్టుగానే రిపోర్టు ఇస్తుందని అన్నారు. శాసనమండలిలో ఇందాపూర్, భోలేబాబా, హెరిటేజ్‌పై చర్చకు వైసీపీ తీర్మానం ఇచ్చినా కూటమి ప్రభుత్వం ఎందుకు తోక ముడిచిందో సమాధానం చెప్పాలని విష్ణు డిమాండ్ చేశారు. జంతువుల కొవ్వు, బాత్ రూమ్ కెమికల్స్ కలిపారని ఏ ఆధారాలతో మాట్లాడారో చెప్పాలని అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారో కూడా వివరణ ఇవ్వాలని అడిగారు.

# కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- మొదటి పేజి తరువాయి

భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేం దుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.
భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

# కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.
వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి.ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు.
ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

# పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు.ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

# భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జీవవీ) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం.
ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది.ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

## ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఐఆర్టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కాంకు సంబంధించి విజయవాడలోని ఏపీబీసీఎల్ కార్యాలయం నుంచి ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలను చోరీ చేశారంటూ ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఆయనపై ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో 2024 జూన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు.హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఐడీ సోదాలకు వెళ్లిన సమయంలో వాసుదేవరెడ్డి పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉండగా... తాజాగా సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు.

# నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- మొదటి పేజి తరువాయి

కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు.చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని
విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

# మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా

- మొదటి పేజి తరువాయి

ఎక్స్ వేదికగా భావోద్వేగంతో కూడిన పోస్టును పెట్టారు. మన స్నేహాన్ని, జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపారు. ఒక స్నేహితుడిగా, సోదరుడిగా ఎప్పటికీ గుర్తుండిపోతావని ట్వీట్ లో పేర్కొన్నారు. గౌతమ్ రెడ్డితో జగన్ ఎంతో సన్నిహితంగా ఉండేవారనే విషయం తెలిసిందే.
2022 ఫిబ్రవరి 21న గౌతమ్ రెడ్డి మృతి చెందారు. గుండెపోటుకు గురైన ఆయన హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఐసీయూలో దాదాపు 90 నిమిషాల పాటు వైద్యులు అత్యవసర చికిత్సలు చేసినప్పటికీ ఆయన ప్రాణాలు దక్కలేదు.

### దేవరపల్లి మాజీ వీుజ, ప్రస్తుత సర్పంచ్

# కడిమి రాజు పరామర్శ చిన వైసీపీ నాయకులు




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 21.** స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ కొట్టు వెంకట్ (నాగు ) నేత్రుత్వంలో దేవరపల్లి మాజీ వీుజ, ప్రస్తుత సర్పంచ్ కడిమి రాజు ఇటీవల అనారోగ్యం గురి కావడం వలన దేవరపల్లి ఆయన్ని కలిసి పరామర్శించిన తాడేపల్లిగూడెం గూడెం చెందిన స్టేట్ వైస్సార్సీపీ యూత్ వింగ్ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శిలు కనుపూరి భాస్కర్, కట్టా నాగరాజు, జిల్లా యువజన వైస్ ప్రెసిడెంట్ ఆరిమిల్లిరవి, మేకా శ్రీను తదితరులు ఉన్నారు

# పెన్ పవర్

## పోలవరం - ఏలూరు

## తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# పెన్ పవర్ కధనానికి స్పందించిన ఉపాధి సిబ్బంది సోషల్ ఆడిట్ షెడ్యూల్ విడుదల.



Government of Andhra Pradesh-RD
SOCIETY FOR SOCIAL AUDIT, ACCOUNTABILITY AND TRANSPARENCY (SSAAT)

TO
The Project Director
DWMA
East godavari Dt.
Sub: Intimation about Grama Sabha Schedule
The 18 th round social audit process is being conducted in Gokavaram Mandal from 18.02.2026 to 14.03.2026. As a part of the social audit Process (EGS/ Convergence Dept,) the GramaSabha will be conducted as per the details given in the proforma below. The MPDO is requested to inform all the elected PRI representatives about the date of the Grama Sabha as per the schedule given below.

| S.NO | NAME OF THE PANCHAYATHI | Gramasabha date and Time | PLACE | Name of the Observer | Designation | Ph No. |
|---|---|---|---|---|---|---|
| 1 | Mallavaram | 23.02.2026 11.00 PM | Grama Panchayati Building | M. Chimma Raju Dora | Mandal Education Officer-2, Gokavaram | 6302199011 |
| 2 | Kamaraju Peta | 23.02.2026 02.00 PM | Grama Sachivalaya Building | Raja Rajaswari | Agriculture Officer,Gokavaram | 8331056578 |
| 3 | Gangam Palem | 25.02.2026. 10.00 AM | Grama Panchayati Building | Rama Krishna | A.E. RWS, Gokavavaram | 7995879943 |
| 4 | Tirumalayapalem | 27.02.2026 2.00 PM | Grama Panchayati Building | Sai Baba | A.E. Housing, Gokavaram | 7093930464 |
| 5 | Rampa Yerrampalem | 27.02.2026 4.00 PM | Grama Sachivalaya Building | Rama Krishna | A.E. RWS, Gokavavaram | 7995879943 |
| 6 | Gummaladoddi | 02.03.2026. 2.00 PM | Grama Panchayati Building | Rini | Horticulture Officer | 7995086840, 7995086841 |
| 7 | Atchutapuram | 04.03.2026 12.00 AM | Grama Sachivalaya Building | Raja Rajaswari | Agriculture Officer,Gokavaram | 8331056578 |
| 8 | Vedurupaka | 04.03.2026 3.00 PM | Grama Panchayati Building | Rama Krishna | A.E. RWS, Gokavavaram | 7995879943 |
| 9 | Gadelapalem | 09.03.2026. 10.00 AM | Grama Panchayati Building | Sai Baba | A.E. Housing, Gokavaram | 7093930464 |
| 10 | Krishnuni Palem | 09.03.2026. 10.00 AM | Grama Sachivalaya Building | Rama Krishna | A.E. RWS, Gokavavaram | 7995879943 |
| 11 | Itikayala Palle | 09.03.2026. 2.00 PM | Grama Sachivalaya Building | M. Chimma Raju Dora | Mandal Education Officer-2, Gokavaram | 6302199011 |
| 12 | Thanti Konda | 14.03.2026 10.00 AM | Grama Panchayati Building | Rama Krishna | A.E. RWS, Gokavavaram | 7995879943 |
| 13 | Kothapalli | 14.03.2026 2.00 PM | Grama Panchayati Building | M. Chimma Raju Dora | Mandal Education Officer-2, Gokavaram | 6302199011 |
| 14 | Gokavaram | 14.03.2026 04.00 PM | Grama Sachivalaya Building | B. Gowramma | Mandal Education Officer-1, Gokavaram | 6305824326 |

PUBLIC HEARING DATE - .03.2026 - 10:00 AM

Sd/-
SRP, Social Audit
SSAAT-RD

APO MGNREGS
Gokavaram

MPDO/PO MGNREGS
Gokavaram

**గోకవరం పెన్ పవర్ ఫిబ్రవరి 21 :--** గతవారం రోజులుగా మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సోషల్ ఆడిట్ జరుగుతున్న కనీసం షెడ్యూల్ లేకుండా ఆడిట్ నిర్వహించడంపై పలువురు ఉపాధి కూలీలు ఏంజరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్న విషయాన్ని పెన్ పవర్ పత్రిక ప్రతినిధి దృష్టికి తీసుకురావడంతో నిన్నటి రోజున ""“షెడ్యూల్ లేకుండా ప్రారంభమైన ఉపాధి సోషల్ ఆడిట్... వాస్తవాలు బయటకు తీస్తారా రహస్య దర్యాప్తుల...????"“ అని వచ్చిన కథనానికి గోకవరం మండలం ఉపాధి హామీ సిబ్బంది స్పందించారు. తక్షణం సోషల్ ఆడిట్ జరిగే గ్రామాలు షెడ్యూల్ విడుదల చేసారు. ఫిబ్రవరి 23 మల్లవరం,, ఫిబ్రవరి 25 గంగంపాలెం,, ఫిబ్రవరి 27 తిరుమలాయ పాలెం, రంప యర్రం పాలెం,, మార్చి 02 గుమ్మళ్ళ దొడ్డి,,మార్చి 04 అచ్చుతాపురం,,వెదురుపాక,, మార్చి 09 గాదెలపాలెం, ఇటికాయల పల్లి,, కృష్ణునిపాలెం,, 14 తంటికొండ,,కొత్తపల్లి,, గోకవరం గ్రామాలలో గ్రామ సభలు జరుగుతాయని గోకవరం ఎంపీడీవో ఎం గోవింద్ తెలిపారు. అదే విధంగా ఈ సామాజిక తనిఖీకి రిసోర్స్ పర్సన్ పి. రామారావు, మండల ఏ పీ ఓ అప్పలరాజు పర్యవేక్షణ జరగనున్నట్లు మండల స్థాయి సభ ఇవన్నీ పూర్తి అయిన తర్వాత ప్రకటిస్తామని ఎం పీ డీ వో తెలిపారు.

# వచ్చే గోదావరి మహా పుష్కరాలపై సన్నాహకాలకు

# వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలి

### కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**2027లో నిర్వహించనున్న గోదావరి మహా పుష్కరాల విజయవంతం గా నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో సమగ్ర సన్నాహక చర్యలు ప్రారంభమయ్యాయి.

ఈ మేరకు జిల్లా కలెక్టర్ ,జిల్లా మేజిస్ట్రేట్ కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, 2027 పుష్కరాలకు జిల్లాలో పార్కింగ్ స్థలాలు, పుష్కర నగర్ల కోసం అవసరమైన భూమి పార్శిళ్ల గుర్తింపుపై 7 రోజుల్లోగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ లో కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్, రాజమహేంద్రవరం , కొవ్వూరు డివిజన్ల ఆర్డీవోలు, ట్రాఫిక్ డీఎస్పీలు, రోడ్లు, భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్లు, జిల్లా ఎండోమెంట్స్ అధికారులు, జిల్లా రవాణా అధికారి, ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్, సిపిఓ రుడా తదితర శాఖాధిపతులు ఉమ్మడి తనిఖీల్లో పాల్గొనాలని సూచించారు.



క్షేత్ర సందర్శనల సందర్భంగా యాత్రికుల రాకపోకల దృష్ట్యా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు , వాహనాలకు పార్కింగ్ స్థలాలు గుర్తించడంతో పాటు, ఎన్ని బస్సులు నిలిపి ఉంచవచ్చో ఖచ్చితంగా లెక్కించాలన్నారు. జాతీయ రహదారుల వెంబడి ఉపగ్రహ బస్ స్టాండ్ల గుర్తింపు, 2015 నుండి రాజమహేంద్రవరం, కొవ్వూరు పరిసర ప్రాంతాల జాతీయ రహదారుల టోల్ ప్లాజా డేటా సేకరణ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య విశ్లేషణ చేయాలని ఆదేశించారు. గూగుల్ మ్యాప్స్‌లో సూచించిన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. రెండు సెషన్లలో ఘాట్ల వద్ద ప్రస్తుత పరిస్థితి, ప్రమాదకరమైన లోతు ఉన్న ప్రాంతాల గుర్తింపు, గత పుష్కరాల అనుభవాల సమీక్ష, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారుల అభిప్రాయాలు సేకరించారు. 2015 పుష్కరాల అనుభవాలను విశ్లేషిస్తూ భద్రత, రవాణా, జనసంచారం నియంత్రణపై సమగ్ర వ్యూహరచన అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనవరి 23న నిర్వహించిన సమావేశంలో చర్చించిన అజెండా అంశాలపై కూడా సమీక్ష నిర్వహించి, వాటి అమలుకు జిల్లా స్థాయిలో తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.

# హిందుత్వాన్ని , హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న వైసీపీని తరిమికొట్టాలి

- **శాసనమండలిలో దేవదేవుడి పోటో తో వైసిపి నేతల అవహేళన పై ఖండన**
- **మీడియా సమావేశంలో మంత్రి కందులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు విమర్శలు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**ప్రజాస్వామ్యం పట్ల, రాజ్యాంగం పట్ల గాని, గవర్నర్, ప్రజల పట్ల గాని కనీస గౌరవ, మర్యాదలు ఇవ్వని జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేయడం ఆంధ్ర ప్రజల దౌర్భాగ్యమని కూటమి నేతలు అన్నారు. అధికారంలో ఉన్న, లేకపోయినా జగన్ ఫ్యాక్షన్ మనస్త త్వంతో రాష్ట్రంలో మతసామ రస్యాన్ని దెబ్బతీసే అరాచక రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజ మెత్తారు. గత ఎన్నికల ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పి 11 సీట్లతో ఇంట్లో కూర్చోబెట్టినప్పటికీ జగన్ రెడ్డి శుద్ర రాజకీయాలు మానడం లేదని విమర్శించారు. స్థానిక రివర్ బేలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి ,బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకటరావు, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, తెలుగు దేశం జిల్లా అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితర నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో దేశ పార్లమెంటరీ, శాసన వ్యవస్థలో ఎన్నడూ ఎక్కడా లేనివిధంగా సెక్యులర్ విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర శాసనమండలిలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమతో వైసిపి ఎమ్మెల్సీలు చెప్పులతో నిరసన వ్యక్తం చేయడం, ఫోటోలు విసిరివేయడాన్నీ వారు తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డు కల్తీ విమర్శ ల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి జగన్ రెడ్డి దర్శకత్వంలో శాసనమండలి వేదికగా కుట్రపూరితంగా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలు గౌరవించ లేని వ్యక్తి, హైందవ ధర్మాన్ని, హిందువుల మనోభావాలను దెబ్బతీయడం ద్వారా రాష్ట్రంలో మత సామరస్యాన్ని విఘాతం సృష్టించడానికి జగన్ రెడ్డి కుట్ర చేసినట్లుగా ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా హిందూ దేవాలయాలపై దాడులకు జగన్ రెడ్డి పాల్పడ్డారని, దేవదేవుడుతో రాజకీయాలు చేయడం వచ్చే ఎన్నికల్లో ఈ 11 సీట్లు కూడా మిగలవన్నారు. ఇటువంటి హిందూ మతోన్మాదిని వచ్చే ఎన్నికల్లో మతాలకతీతంగా ప్రజలందరూ తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, పులివెందుల ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజ సమస్యలను పక్కనపెట్టి , తిరుమల లడ్డు కల్తీ జరిగిందని సిట్ నిర్ధారించినప్పటికీ హెరిటేజ్ కు ఇతర పార్టీలకు అంటగట్టడం అతని ఫ్యాక్షన్ రాజకీయాలకు అర్థం పడుతుందన్నారు. చివరకు ఆ దేవదేవుడితో కూడా జగన్ రాజకీయాలు చేస్తున్నారని వచ్చే ఎన్నికల్లో 11 పోయి, అరడజను దొంగలుగా మిగిలిపోతారన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలు వైసిపి రాష్ట్రాన్ని విధ్వంసం చేయడంతో ఇంట్లో కూర్చోబెట్టిన జగన్ కు బుద్ధి రాలేదని అన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్ళు జగన్ హిందూ మతాన్ని గౌరవించలేదని కనీసం ప్రసాదం కింద పడేసారని, లడ్డు విషం అయిందని అయానికి ముందే తెలిసే తినలేదని అన్నారు.

ఎం ఎల్ సి సోము వీర్రాజు మాట్లాడుతూ

లడ్డు కల్తీ వ్యవహారంపై హెరిటేజ్ పై సుప్రీంకోర్టు మాట్లాడవద్దని చెప్పడంతో గత్యంతరం లేక దేవదేవుడు ఫోటోతో శాసనమండలిలో రచ్చ చేయాలని జగన్ రెడ్డి తన



ఎమ్మెల్సీల ను పురిగొల్పరని విమర్శించారు. తిరుమల దేవస్థానం మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి కూడా లడ్డు కల్తీ జరిగిందని అంగీకరించిన తర్వాత కూడా జగన్ రెడ్డి కలియుగ దైవంతో కుట్ర రాజకీయాలు చేయడం తగదన్నారు. మద్దిపాటి వెంకటరావు మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వం గా ఉండే దేశంలో, రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా జగన్ రెడ్డి పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పవిత్రమైన దేవదేవుడు వద్దకు కాలినడకన కిలోమీటర్ల నడిచే భక్తులకు చెప్పులతో దేవదేవుడి ఫోటోలతో శాసన మండలి లో నిరసనగా దిగడం వెనుక జగన్ నేరపూరిత మనసత్వానికి అర్థం పడుతుందని విమర్శించారు. జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడుబొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, గత గత ఐదేళ్లు 300 పైగా హిందూ దేవాలయాలపై దుశ్చర్యలకు జగన్ పాల్పడ్డాడని, తిరుమల లడ్డును కల్తీ చేశాడని ,హిందూ ధర్మానికి, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నాడని విమర్శించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ, ప్రజాస్వామ్యవస్థలో జగన్ ఫ్యాక్షన్ రాజకీయాలను, హిందూ మతోన్మాద చర్యలను చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

# దడ పుట్టిస్తున్న ఇసుక లారీలు



**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** సామాన్యులు హెల్మెట్ ధరించలేకపోతే కేసు. ఆటో రోడ్డు మార్జిన్ లో నిలిపితే ట్రాఫిక్ సమస్య కారణంగా కేసు మరి ఇసుక లారీలు ఓవర్ లోడ్ తో నిత్యం రద్దీగా ఉండే మండలంలోని రోడ్డుపై అత్యంత ప్రమాదకరంగా దడ పుట్టిస్తూ నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా ఇటువంటి కేసులు ఉండవు. కూటమి ప్రభుత్వం పాలనలో ఇది పోలీసులు, రవాణా శాఖ అధికారులు తీరు అధికారుల వైఖరి పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం మండల పరిధిలోని రఘుదేవపురం , సింగవరం, ముని కొడలి, కాటవరం, నుండి ఇసుక లారీలు ప్రజలకు దడ పుట్టిస్తున్నాయి. ఇసుక ర్యాంపుల నుండి ఇసుక తరలించే లారీలు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. లారీలో 40 నుంచి 60 టన్నులు ఇసుకలోడుతో లారీలు జనావాసాల మీదుగా ప్రయాణించటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఓవర్ లోడుతో ఉన్న లారీలకు అడ్డు అదుపు లేకుండా ప్రయాణిస్తున్నాయని ప్రజలు ప్రాణభయంతో ఉన్నారు. రోడ్డుపై ఓవర్ లోడుతో ఇసుక లారీలు తిరుగుతుంటే సురక్షితంగా ప్రయాణం ఎలా చేయగలుగుతామని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రోడ్డు భద్రతపై అధికారులు కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటే సరిపోదని ఆచరణలో అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చిన్నాచితకా వాహనదారులపై కేసులు రాసి పోలీసులు టార్గెట్లు పూర్తి చేయడం కాదని ఓవర్ లోడ్ తో ఉన్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ పోలీస్ అధికారులు స్పందించి ఓవర్ లోడ్ లారీలపై కొరడా చూపించాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.




# అభివృద్ధికి మూలం విద్య. పార్డ్ సంస్థ అధ్యక్షులు వెంకటేష్.




**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి21:** యువత విద్యపై దృష్టి పెట్టి అనుకున్న లక్ష్యాలను సాధించాలని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ గోపాలపురం మండల శాఖ అధ్యక్షులు దొడ్డి గర్ల వెంకటేష్ అన్నారు. స్థానిక పెద్ద గూడెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసే విద్యార్థులకు విద్య సామాగ్రిని శనివారం సాయంత్రం అందజేశారు.పార్డ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటేష్ మాట్లాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు విద్య నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది దళితులు గతంలో ఎంతో కష్టపడి విద్యను అభ్యసించి నేడు ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉండడం ఆనందంచదగ్గ విషయం అన్నారు. అయితే ప్రస్తుతం కొంతమంది యువకులు విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు చదువు యొక్క గొప్పతనాన్ని గ్రహించాలని సూచించారు. సంఘ కార్యదర్శి విశ్రాంత ఉపాధ్యాయులు చింతలపూడి భాస్కరరావు మాట్లాడుతూ ఎంతోమంది దళిత యువకులు ఉన్నత విద్యను అభ్యసించి అభివృద్ధి చెందారని గుర్తు చేశారు అటువంటివారిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని చదువుల్లో రాణించాలన్నారు. సంఘ కోశాధికారి ఎం కొండలరావు మాట్లాడుతూ పయనించాలన్నారు. చదువుతోపాటు క్రీడలు, సమాజ సేవ వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. వ్యసనాలుకు దూరంగా ఉండి నాణ్యమైన విద్యను అభ్యసించి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు.పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ గోపాలపురం మండల శాఖ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని ప్రతి ఒక్కరు వారిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ వార్షిక పరీక్షలు వ్రాసే సుమారు 30 మంది విద్యార్థులకు పరీక్షలు రాసే ప్యాడ్లు, పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘ సభ్యులు వింజు మూరి సుబ్బారావు, గుమ్మడి నాగేశ్వరరావు, సరిపల్లి వెంకటేష్, పాముల తిరుపతయ్య, విద్యార్థులు తాడేపల్లి నవ్య తేజస్వి, ఎలిపే మౌనిక, పెంట పాటి సింధూజ, మరపట్ల అర్చన, పాముల వరుణ్ సందేశ్, మరపట్ల ప్రదీప్, పుచ్చకాయల దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరప్పాడు వెంకన్నకు కొబ్బరి పువ్వు- కలియుగ వాసుడి ముసిముసి నవ్వు

# స్వర్ణ జడేరు పర్యటనలో డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర ఆదేశాలు





**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**గంగవరం మండల డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర శనివారం స్వర్ణ జడేరు గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న యు ఎస్ ఎఫ్,పి4 మరియు ఆధార్ సెంటర్ సేవలను సమీక్షించి, ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మోహనాపురంలో యు ఎస్ ఎఫ్ సర్వే ప్రగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జడేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా తగిన చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.అలాగే గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, స్టాక్ రికార్డులను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నదా అనే విషయంపై విచారణ జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సేవలు అందించాల్సిందిగా సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జడేరు వీఆ స్కూలు హెచ్ఎం నూకారత్నం, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పి.ఎస్. బ్రహ్మజిరావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి



**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం
గంగవరం లోని గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందిస్తున్న ప్రజా సేవలపై ఆయన సమీక్ష నిర్వహించారు.గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కార్యదర్శి శ్రీనివాసులకు సూచించారు. ప్రజలకు తాగునీరు నిరంతరంగా అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.అలాగే గ్రామాల్లో వీధి లైట్ల ఏర్పాటు, మరమ్మతుల పరిస్థితి, పారిశుధ్య నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.గ్రామాల అభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సచివాలయం కార్యదర్శి శ్రీనివాసు ఉన్నారు.

# శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి బృందావన రామానుజ జీయర్ స్వామి పర్యటన





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**విజయవాడకు చెందిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అష్టాక్షరి బృందావన రామానుజ జీయర్ స్వామి శనివారం పోలవరం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తొలిత సీతపల్లి మాతృశ్రీ శ్రీ శ్రీ గడి బాపనమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన స్వామీజీకి ఆలయ అర్చకులు రామకోటేశ్వరరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు . అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఐ పోలవరంలో గోవింద గిరి పై తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని స్వామీజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ, రామనామ స్మరణ పై భక్తులకు ప్రవచనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు రాట్నాల సూర్య, డివిడి ప్రసాద్, నాగమణి, గుడ్ల అంక శ్రీనివాస్ రెడ్డి,, బుల్లి కొండలు దొర, నల్లమిల్లి వెంకట రామారెడ్డి ,లీలా నాగు వీరభద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# వారపు సంతలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం



**గంగవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 21:**గంగవరం వారపు సంతలో శనివారం ట్రాఫిక్ నిబంధనలు మరియు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగవరం ఎస్సై వెంకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.సంతకు భారీగా తరలివచ్చిన ప్రజలకు ట్రాఫిక్ నియమాలు పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. ముఖ్యంగా వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, ముగ్గురు వ్యక్తులు ఒకే వాహనంపై ప్రయాణించడం (ట్రిపుల్ రైడ్) చట్ట విరుద్ధమని, మద్యం సేవించి వాహనం నడపడం (డ్రంకన్ డ్రైవ్) వల్ల ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని ఎస్సై వెంకయ్య పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాదేవి, సంత వ్యాపారులు, వాహనదారులు పాల్గొన్నారు.

# కామరాజపేట లో గత కొన్ని నెలలుగా మూతబడిన సచివాలయం వెల్నెస్ సెంటర్లు.

ఆసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా బిల్డింగులు.






**గోకవరం పెన్ పవర్ ఫిబ్రవరి 21:-**గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రజలకు ప్రతి శాఖద్వారా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి అందించే విధంగా ఉండాలని సంకల్పించి ఏర్పాటు చేసి పక్కా బిల్డింగులు నిర్మించడమే కాకుండా దానికి తగినట్టుగా సిబ్బందిని కూడా నీయమించడం జరిగింది. అలా ప్రజలకు ప్రభుత్వ సర్వీస్ లు అందించడానికి సంకల్పించిన వ్యవస్థ కాస్తా ప్రభుత్వం మారగానే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. గోకవరం మండలంలోని కామరాజుపేట పంచాయతీలో సచివాలయం – 2 గత ప్రభుత్వంలో మాత్రమే కాకుండా సుమారు సంవత్సరకాలం వరకు ప్రజలకు అనేక సేవలు అందించడం జరిగింది. తాజాగా అధికారులు పర్యవేక్షణ లోపమో పాలకులు నిర్లక్ష్యమో తెలియదు కానీ కామరాజుపేట లోని సచివాలయం -2 మరియు విలేజ్ హెల్త్ సెంటర్ తాళాలు వేసి సేవల నిలిచిపోవడంతో అక్కడ సిబ్బంది ఉన్నారో లేదో తెలియని పరిస్థితిలో ఆ కార్యాలయాలు ఉన్నాయని అంతే కాకుండా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి అనడంలో అతిశయోక్తి లేదని స్థానికులు పోతున్నారు. అనేకమంది స్వయంగా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి తమ సేవలు పొందే వారని తాజాగా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ కార్యాలయం ఎక్కడుందో ఏ సిబ్బంది ఎక్కడున్నారో తెలియక నాయకులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని ఇదేనా "మా మంచి ప్రభుత్వం" అంటూ నిరాశతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజవర్గ స్థాయి మార్కెట్ కమిటీ చైర్మన్ ఈ గ్రామంలో ఉన్న పరిపాలన ఇలా ఉందా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకుని ఎక్కడ సేవల అక్కడ అందే విధంగా చర్యలు చేపట్టాలని కామరాజుపేట గ్రామస్తులు కోరుతున్నారు.

# గోవిందగిరి శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించిన రీజినల్ ఫైర్ ఆఫీసర్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించబడిన పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం రూరల్ పరిధిలోని ఐ పోలవరం గోవిందగిరి శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ విశేషాలను వివరించారు. ఆలయ అర్చకులు శ్రీ గోవర్ధనం శ్రీ మణికంఠాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రీజినల్ ఫైర్ ఆఫీసర్ స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.




# అడ్డతీగల సిహెచ్ సి లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం....






**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి21:** స్థానిక అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండ. సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మొక్కలు నాటడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలాగే హాస్పిటల్ లో ఉన్న పరిసరాలు,పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో,స్వచ్ఛత మరియు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శ్రమదానం పరిశుభ్రత గురించి డాక్టర్ మహేష్ రెడ్డి అందరికి వివరించారు. అలాగే నేను వేసిన ఈ ముందడుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రపరచడంలో సహాయం చేస్తుందని, నమ్ముతూ ఈ కార్యక్రమం తలపెట్టడం జరిగింది అని గవర్నమెంట్ సూచనలు అనుగుణంగా ప్రతి కార్యక్రమం, ప్రతి ఒక్కరు తుచా తప్పక పాటించాలని హాస్పిటల్ కౌన్సిలర్ నారే. వాసు ప్రతిజ్ఞ చేయించారు. అలాగే నేను నా పరిసరాలు, పరిశుభ్రత కొరకు ప్రతిరోజు కొంత సమయం కేటాయిస్తానని, అవగాహన కల్పిస్తానని,మన ఆంధ్రప్రదేశ్ ను స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేటట్లు నా వంతు కృషి చేస్తానని డాక్టర్ హర్ష అన్నారు.
అలాగే హాస్పిటల్ స్టాఫ్ అందరితో కలిసి వైద్యులు సమక్షంలో,పేషెంట్స్ కొంతమంది తో కలసి వాసు ప్రమాణం చేయించారు.
అలాగే డాక్టర్స్ అందరు కలిసి మొక్కలు నాటారు, వచ్చిన పేషెంట్స్ భోజనానికి ముందు చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో , అలాగే ఇంటి దగ్గర మన దయానొందిన కార్యక్రమం లో ఎల్లపుడు శుభ్రం గా ఉండడం వలన రోగాలు మనకు దరి చేరవు అని కౌన్సిలర్ వాసు పేషెంట్లకు తెలియజేశారు . ఈ కార్యక్రమం లో హాస్పిటల్ డాక్టర్స్ , అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్, వసంత,ఊహ, దేవుడు,లక్ష్మి, శాంతి, సునీత, రమణారెడ్డి,శివ, వెంకట లక్ష్మి,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి డి.ఎస్.పి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 21 ;** ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు ప్రతి ప్రయాణంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలవరం డిఎస్పి ఎం వెంకటేశ్వరరావు సూచించారు .శనివారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయంలో హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుందని అన్నారు .వేగ పరిమితి పాటించి నట్లయితే ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు .మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని అన్నారు .కనుక ప్రతి ఒక్కరూ రహదారి నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రాణ రక్షణే మా ప్రధాన లక్ష్యం, అని అందరూ బాధ్యత తో ఉండి సురక్షిత సమాజాన్ని నిర్మిద్దాం అని అన్నారు. వాహనదారులు నియమాలు పాటిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దర్భ గూడెం గ్రామంలో శ్రీ భూలక్ష్మి దేవి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా పోలవరం సిఐ పి బాలసురేష్ బాబు, ఎస్సై వి క్రాంతి కుమార్ దర్శించుకున్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



డిప్యూటీ ఎంపీడీవో గోపన్నదొర

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధన కోసం విద్యార్థులు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర సూచించారు. మండలంలోని మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థి దశకు నాంది లాంటిదని కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలతో భవిష్యత్తుకు బాట వేసుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు జరుగుతుంది లేనిది విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు ఆర్ వి వి సత్యనారాయణ, డిప్యూటీ వార్డెన్ వీరపురెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# కొత్తపల్లి రుద్ర భూమిని నేను పునరుద్ధరిస్తా రిటైర్ ఓఎన్జిసి ఉద్యోగి దిండి వెంకటేశ్వరరావు.





**గోకవరం పెన్ పవర్ ఫిబ్రవరి 21:-** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సూరంపాలెం ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఉన్న రుద్రభూమిలో దహన సంస్కారాలు పూర్తి అయ్యేంతవరకు సేద తీరడానికి గతంలో నిర్మించిన భవనంలో కొందరు దుండగులు చేతిలో శిథిలం అయిపోవడంతో గ్రామస్తులు ద్వారా విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రిటైర్డ్ ఓఎన్జిసి ఉద్యోగి దిండి వెంకటేశ్వరరావు స్పందించారు అనుకున్నదే తడవుగా పని ప్రారంభించడానికి నడుం బిగించారు. తక్షణం తన అనుచరులతో కొత్తపల్లిలో ఉన్న రుద్రభూమికి వెళ్లి పరిశీలించి అక్కడ ఏమి ఏమి అవసరమో అవన్నీ కూడా పూర్తిగా తన సొంత నిధులతో చేస్తానని పనులు ప్రారంభించారు గతంలో ఇదే రుద్ర భూమిలో నిర్మించిన విశ్రాంతిభవనం కొందరు ఆకతాయిలు, అల్లరి మూకలు ఆ భవనంలో చేరి మందు తాగి ఆ సీసాలు పగలగొట్టి తాగిన మైకంలో అక్కడ ఉన్న ఫ్లోర్ ని కూడా నాశనం చేయడం జరిగినట్లు గుర్తించి ఈ విషయాన్ని గ్రామస్తులు టిడిపి సీనియర్ నాయకులు దిండి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకురాగా,ఆయన తక్షణం స్పందించి అక్కడికి వెళ్లి తన సొంత ఖర్చులతో బాగు చేయిస్తాను అని మాట ఇవ్వడంతో పాటు పనులు కూడా మొదలు పెట్టించడం జరిగింది అంటూ కూటమి నాయకురాలు చల్లా రాజ్యలక్ష్మి మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ముదిలి రామచంద్రరావు, కొత్తపల్లి శివాలయం మాజీ చైర్మన్ బలస ప్రకాశం, టిడిపి నాయకులు దిండి సూరిబాబు, ముత్తా శ్రీనివాస్, పువ్వల వీధి దిండి వెంకటేష్, ముదిలి సతీష్, మల్లపురెడ్డి రాంబాబు, భవిరిశెట్టి వెంకన్న, జనసేన నాయకులు వద్దే ఆనంద్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# చెత్త సేకరణ వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే




**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 21;** గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం కూడా అవసరమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు .శనివారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తాటి యాకులగూడెం సచివాలయానికి కేటాయించిన నూతన చెత్త సేకరణ వాహనాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆయన తండ్రి చిర్రి కృష్ణయ్య రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ ద్వారా గ్రామాల్లో వ్యాధులు నివారించవచ్చని అన్నారు.. ప్రజలు ఈ వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, పంచాయతీ సర్పంచ్ వనమా రాంబాబు, జనసేన గ్రామ అధ్యక్షులు రాయి సుబ్బారావు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలను పరిశీలించిన ఎమ్మెల్సీ



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఫిబ్రవరి 21;** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బోర్ర గోపి మూర్తి సూచించారు. శనివారం మండలంలోని అంకన్నగూడెం, రాచన్నగూడెం, కామయ్యపాలెం, బర్రింకలపాడు పాఠశాలలను, కళాశాలలను పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. పరీక్షలు విషయం మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. చక్కగా చదువుకొని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈయనతోపాటు ఉపాధ్యాయులు అల్లాడి రాజు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని గంగవరం మండలం కొత్తాడ గ్రామంలో శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పేద ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్, కందుల సాయి, కుంజం రామకృష్ణ దొర ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.గంగవరం మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ఈ నెల షెడ్యూల్ ప్రకారం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23న మర్రిపాలెం, 26న ఆముదాలబండ, 28న కుసుమరాయి గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, మాజీ సర్పంచ్ పరమేష్, గ్రామ పెద్దలు కలుముల వెంకన్న దొర, కారం ప్రసాద్, కారం రాజకుమార్, డాక్టర్ ప్రసాద్, ఫార్మసిస్ట్ స్వర్ణ, ట్రస్ట్ సిబ్బంది నాని, ఎంఎల్‌హెచ్‌ఓ మానస, ఏఎన్ఎమ్ కృష్ణవేణి, ఆశా వర్కర్లు సత్యకుమారి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ ద్వారా ఆర్థిక అభివృద్ధి

## ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21 :** పోలవరం జిల్లాలోని మహిళలు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సబ్సిడీపై పాడి గేదెలు పంపిణీ చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని గంగవరం, రాజవొమ్మంగి, అడ్డ తీగల మండలాల్లోని 180 మంది మహిళలకు మూడు కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో ఒక్కొక్క మహిళా లబ్ధిదారునికి రెండు పాడి గేదలు చొప్పున 90 శాతం సబ్సిడీపై మహిళా మణులకు పాడి గేదెల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పాడి గేదెల మంజూరు చేసిన మహిళా మణులకు మూడు నెలల పాటు గేదెలకు పశుగ్రాసం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఒక్కొక్క గోకులం షెడ్డు కు 22 లక్షల రూపాయల వ్యయంతో 3 కోట్ల 96 లక్షల రూపాయల వ్యయంతో గంగవరం మండలంలోని 7 గోకులం షెడ్లు, రాజవొమ్మంగి మండలంలో 6 గోకులం షెడ్లు, అడ్డతీగల మండలంలో 5 గోకులం షెడ్లు మొత్తం మూడు మండలాల్లో 18 గోకులం షెడ్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గోకులం షెడ్లు నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలోని మహిళలు పాడి పరిశ్రమ ద్వారా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలైన పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలోని గిరిజనులు వివిధ రకాలైన పథకాలు సద్వినియోగ పరుచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. మహిళలకు ఏర్పాటుచేసిన పాడి గేదెలకు ఇన్సూరెన్స్, మూడు నెలల పాటు పశుగ్రాసం, గోకులం షెడ్లలో ఏవిధంగా పాడి గేదెలను పెంచుతున్నది ఎప్పటికప్పుడు పరివేక్షించాలని రంపచోడవరం ఎపిఓ జనరల్ డిఎన్వి రమణను, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్ ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# వైసిపి ఉప సర్పంచ్ టిడిపిలో చేరిక




**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన వైసిపి ఉప సర్పంచ్ కాండ్రేగుల ఫణి శనివారం నాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తూర్పుగోదావరి జిల్లా రుడా చైర్మన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నియోజకవర్గ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి సమక్షంలో సీతానగరం మండల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గడ్డం తిమ్మారావు ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నాయకులు ఫణి బాబుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన చేరికతో వంగలపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫణి బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి మరియు ప్రజాసేవ తన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి పార్టీ ప్రెసిడెంట్ గద్దె నాని, వైస్ ప్రెసిడెంట్ కొరవాటి గోపి, టిడిపి నాయకులు గద్దె శీను, గద్దె వెంకటకృష్ణ చౌదరి (నలిని), సింగవరం గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య, నీరుకొండ శివ, పుక్కల శీను, పెంద్యాల ఆశన్న బాబు, మద్దిపాటి సుజీరాజు, సింహాద్రి వీర్రాజు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్ సోలార్ కెమెరాలతో ప్రత్యేక నిఘా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 21**:సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వ్రాత పరీక్షల సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బంది, అభ్యర్థులు సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా డి ఎచ్ ఎం డి, ఎచ్ ఎం డి లతో తనిఖీలు నిర్వహిస్తూ పరీక్షలు పూర్తయ్యే వరకు విధులలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

వ్రాత పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తును, కట్టుదిట్టమైన ఏర్పాట్లను జిల్లా పోలీసు లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షలు పూర్తయ్యేవరకు అధికారులు సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించా లన్నారు. అభ్యర్థులకు నిర్దేశించిన సమయం (08.30 ఎ ఎం) లోపు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవలనీ ,పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అభ్యర్థుల సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించరన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వెయ్యలని, మాస్ కాపీయింగ్, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయరాదని, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి సమయానికి పరీక్షలకు హాజరై, చక్కగా పరీక్షలు రాసి, విజయం సాధించాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ శుభాకాంక్షలు తెలిపారు.

# హిందు వ్యతిరేకి పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ

**మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి**

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** హిందూ వ్యతిరేక పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని ఎందుకు నిదర్శనం కల్తీ నెయ్యితో టిటిడి లడ్డు ప్రసాదాలను తయారు చేయడమే అని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు విమర్శించారు. శాసనమండలిలో శాసనమండలి సభ్యులు చేసిన అపచారానికి దైవ శిక్ష తప్పదు అంటూ శనివారం రంపచోడవరం లోని నారాయణ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయమును టిడిపి నాయకులు సందర్శించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యికాని కల్తీ నెయ్యి వాడారు. ఈ నెయ్యి పై సి.ఎఫ్.టి.ఆర్.ఐ. 1922 సం.లో నివేదిక యిచ్చింది. సిట్ నివేదికలో పామ్ ఆయిలు, పామ్ కెర్నల్ ఆయిల్ కొన్ని ఇతర పదార్థాలతో నెయ్యి కల్తీ అయింది అని తెలిపింది. ఆనాటి టి.టి.డి. చైర్మన్ వై. వి. సుబ్బారెడ్డి నెయ్యి కల్తీ జరిగింది అని అంగీకరించారు. తరువాత యన్. డి.డి.బి. నివేదిక కూడా నెయ్యి కల్తీ అని తేల్చింది. లడ్డూ ప్రసాదాల కల్తీ నెయ్యితో తయారు చేసి ఘోర అపచారం చేసారు. ఇంత జరిగినా నెయ్యి కాని కల్తీ నెయ్యి వ్యవహారం మరుగున పర్చటానికి హెరిటేజ పై సాక్షి మీడియా ప్రచారం చేసారు. ఢిల్లీ హైకోర్టు ఫేన్ కండెంట్ మొత్తం ముగించి ఆదేశం మెటా, గూగుల్, యూట్యూబ్లకు ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. దిక్కుతోచక శాసన మండలిలో కాళ్లకు చెప్పులు, బూట్లు వేసుకొని కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఫొటోలతో ప్రదర్శనకు దిగారు. హిందుత్వాన్ని పూర్తిగా వ్యతిరేకంగా వై.యస్.ఆర్.సి.పి. ఎం.ఎల్.సి. లు ప్రదర్శన జరిగింది. ఏ



మతానికైనా గౌరవించవలెననే బాధ్యత అందరిపై ఉంది. హిందూ వ్యతిరేక పార్టీ అయిన వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ దైవం యొక్క శిక్షకు బాధ్యులు కావలసిందే అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అరుకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, సత్తిబాబు, రమణ తదితరులు ఉన్నారు.

## సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

**– కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 21:**తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామపంచాయితీల పరిధిలో ఇంటి పన్నులు, పన్నేతర బకాయిలను సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం తెలియ చేశారు.

జిల్లాలోని 342 గ్రామపంచాయితీల్లో ప్రస్తుతం ఇంటి పన్నులు, పన్నేతరముల బకాయిలు రూ.125.11 కోట్లుగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.54.00 కోట్లు వసూలైనట్లు వెల్లడించారు.మిగిలిన బకాయిలు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు, గత బకాయిలను ఈ నెలాఖరులోపు చెల్లించాలని సూచించారు. ప్రజలు తమ నివాస ప్రాంతం నుంచే సులభంగా పన్నులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిన స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఫోన్‌పే లేదా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చని తెలిపారు.నిర్దేశిత గడువులోగా పన్నులు చెల్లించని పక్షంలో సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే పన్నుల వసూళ్లు కీలకమని పేర్కొంటూ, ప్రజలందరూ స్వచ్ఛందంగా బకాయిలు చెల్లించాలని కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు.

## దడ పుట్టిస్తున్న ఇసుక లారీలు

**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** సామాన్యులు హెల్మెట్ ధరించలేకపోతే కేసు. ఆటో రోడ్డు మార్జిన్ లో నిలిపితే ట్రాఫిక్ సమస్య కారణంగా కేసు మరి ఇసుక లారీలు ఓవర్ లోడ్ తో నిత్యం రద్దీగా ఉండే మండలంలోని రోడ్డుపై అత్యంత ప్రమాదకరంగా దడ పుట్టిస్తూ నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా ఇటువంటి కేసులు ఉండవు. కూటమి ప్రభుత్వం పాలనలో ఇది పోలీసులు, రవాణా శాఖ అధికారులు తీరు అధికారుల వైఖరి పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం మండల పరిధిలోని రఘుదేవపురం , సింగవరం, ముని కొడలి, కాటవరం, నుండి ఇసుక లారీలు ప్రజలకు దడ పుట్టిస్తున్నాయి. ఇసుక ర్యాంపుల నుండి ఇసుక తరలించే లారీలు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. లారీలో 40 నుంచి 60 టన్నులు ఇసుకలోడుతో లారీలు జనావాసాల మీదుగా ప్రయాణించటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఓవర్ లోడుతో ఉన్న లారీలకు అడ్డు అదుపు లేకుండా ప్రయాణిస్తున్నాయని ప్రజలు ప్రాణభయంతో ఉన్నారు. రోడ్డుపై ఓవర్ లోడుతో ఇసుక లారీలు తిరుగుతుంటే సురక్షితంగా ప్రయాణం ఎలా చేయగలుగుతామని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రోడ్డు భద్రతపై అధికారులు కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటే సరిపోదని ఆచరణలో అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చిన్నాచితకా వాహనదారులపై కేసులు రాసి పోలీసులు టార్గెట్లు పూర్తి చేయడం కాదని ఓవర్ లోడ్ తో ఉన్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ పోలీస్ అధికారులు స్పందించి ఓవర్ లోడ్ లారీలపై కొరడా చూపించాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

## హిందూ ధర్మంపై విశ్వాసం లేని వ్యక్తి జగన్ ఎమ్మెల్యే బత్తుల ఫైర్..

**శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా జగన్ వైఖరి**



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదం, తీర్థం ఇస్తే పక్కకు పారవేసే మనస్తత్వం జగన్మోహన్ రెడ్డిది

సొంత మతాన్ని ఆరాధించు పర మతాన్ని గౌరవించు అన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతం మహోన్నతమైనది


శాసనమండలిలో శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలతో వైసిపి నాయకులు వ్యవహరించిన తీరు దారుణం వైసిపి పాలనలో అంతర్వేది, రామతీర్థం విగ్రహాల ధ్వంసం అత్యంత హేయం చెప్పులు వేసుకుని శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలతో వస్తారా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి విరుద్ధం వైసీపీ నేతల ప్రవర్తన

ఎన్నికల్లో దారుణంగా ఓడించి 11 సీట్లకు పరిమితం చేసినా అహంకారం తగ్గని వైసిపి నేతలు

ఎక్కడికి వస్తారు ఏం పీకుతారు ప్రజలు గట్టిగా మరోసారి బుద్ధి చెప్పడం ఖాయం

పర మతాన్ని గౌరవించని జగన్మోహన్ రెడ్డి, వైసిపి నేతలను తరిమి కొట్టడానికి రాష్ట్ర ప్రజల సిద్ధంగా ఉన్నారు సనాతన ధర్మం, హిందూ ధర్మం, శ్రీ వెంకటేశ్వర స్వామి పై జరుగుతున్న దాడిని ప్రజలంతా ఖండించి తిప్పి కొట్టాలి మీడియా సమావేశంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఫైర్ అయ్యారు.

## వాడపల్లి వెంకన్న సన్నిధిలో సినీ నటుడు రాజీవ్ కనకాల



**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి 21:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం సినీ నటుడు రాజీవ్ కనకాల సందడి చేశారు. మండల పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న షూటింగ్‌కి వచ్చిన ఆయన సాయంత్రం ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం రాజీవ్ కనకాల మాట్లాడుతూ గతంలో కూడా స్వామివారిని దర్శించుకున్నానని, అప్పటి నుంచి మంచి జరగడంతో మళ్లీ దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. వెంకటేశ్వర స్వామి తమ కులదైవమని, ఆయన ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆయన రాకతో ఆలయంలో భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఫోటోలు దిగారు.

## సమాచార హక్కు చట్టం జిల్లా కోఆర్డినేటర్ కమిటీమిటీ సభ్యునిగా కోడి తాతారావు (కిషోర్) ఎన్నిక...

**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**తూర్పుగోదావరి జిల్లా సమాచార హక్కు చట్టం పర్యవేక్షణ కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించు కమిటీ నాకు రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన కోడి తాతారావు అలియాస్ కిషోర్ కు జిల్లా కోఆర్డినేట్ కమిటీ సభ్యునిగా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి నియామక పత్రం అందజేశారు.



## వాడివేడిగా సర్వసభ్య సమావేశం

**అధికారులనునిలదీసిన ఎంపీటీసీ ప్రదీప్ కుమార్**




**వి.ఆర్.పురం పెన్.పవర్.ఫిబ్రవరి.21:**మండలంలోని రేఖపల్లి,మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశపుహాలో శనివారం మండల ఎం.పి.పి.కారంలక్ష్మి,అద్యక్షతనలో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం విద్యుత్ సమస్యలపై వాడివేడిగా సాగింది.గ్రామీణ ప్రాంతాల్లో ఎదురవుతున్న విద్యుత్తు,కోతలు,లో–వోల్టేజీ సమస్యలపై ఎంపీటీసీ సభ్యు లు ప్రదీప్ కుమార్ అధికారులను సూటిగా ప్రశ్నించారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గంటల తరబడి విద్యుత్తు నిలిపివేయడం వల్ల సామాన్య ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామాల్లో లో–వోల్టేజీ కారణంగా విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.పొలాల్లో,నివాస ప్రాంతాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచే యాలని,పాతబడిన స్తంభాలను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు.విద్యుత్తు సమస్యలపై లేవనెత్తిన అంశాలపై విద్యుత్తు శాఖ ఏఈ స్పందిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని,లో–వోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని,వివరణ ఇచ్చారు.చివరగా, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహిం చేది లేదని,వచ్చే సమావేశం లోపు ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలని ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీలు సర్పంచులు,వివిధశాఖలఅధికారులు తదితరులు పాల్గొ న్నారు.

## జిల్లా లో పోలీస్ స్టేషన్ ల్లో "స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఎస్డిపిఓ, సర్కిల్ పోలీస్ స్టేషన్ల లో, పోలీస్ స్టేషన్ ల చుట్టుపక్కల ఆవరణములో "స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం పోలీస్ అధికారులు సిబ్బంది చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ లలో శుభ్రం చేయడంతో పాటు, ఆవరణం చుట్టూ ఉన్న చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ప్రతి నెలలో మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని అన్ని పోలీస్ స్టేషన్లలో చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఎస్డిపిఓ, సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు.


## సమాచార హక్కు చట్టం జిల్లా కోఆర్డినేట్ కమిటీ సభ్యుడుగా పెంటగట్ల మణి కుమార్ నియామకం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21** తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం కోండగుంటూరు గ్రామనికి చెందిన పెంటగట్ల మణికుమార్ సమాచార హక్కు చట్టం -2005 తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేట్ కమిటీ సభ్యుడుగా ఎన్నికయ్యారు.



కోఆర్డినేట్ జిల్లా అధికారి నోడల్ అధికారి జిల్లా రెవిన్యూ అధికారి, జిల్లా కమిటీ సభ్యునిగా పెంటగట్ల మణికుమార్ ను సభ్యునిగా ఎన్నిక చేశారు. శనివారం జిల్లా రెవిన్యూ అధికారి తామరల సీతారామ మూర్తి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పెంటగట్ల మణికుమార్ మాట్లాడుతూ, తూర్పుగోదావరి జిల్లా స్థాయి కోఆర్డినేట్ కమిటీ సభ్యునిగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సెక్షన్ 4 సబ్ సెక్షన్ 1 ఎ, సెక్షన్ 4 (1) బి, చట్టం అమలు కొరకు తన వంతు కృషి చేస్తానన్నారు. పౌరులకు ప్రభుత్వ సేవలు, చట్టము వినియోగించు కొను విధి విధానాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నియమకం పట్ల తూర్పుగోదావరి జిల్లా , వివిధ మండల అధికారులు, కొండ గుంటూరు గ్రామ అధికారులు, ప్రజలు, సమాచార హక్కు చట్టం కార్యకర్తలు పెంటగట్ల మణికుమార్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లో మాతృభాషా దినోత్సవం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21**:శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. సభాధ్యక్షులుగా ఆచార్య , తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్య వైస్ ఛాన్సలర్ అధ్యక్షతన డి . మునిరత్నం నాయుడు నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా వ్యవస్థాపకులు ప్రాజెక్ట్ అంతర్యామి వి.వి.ఎన్.ఎస్ మూర్తి మాట్లాడుతూ తెలుగు భాష ఎంత గొప్పదో వాటి ప్రయోజనాలు రాబోయే తరాలకు ఇంటర్నెట్ ద్వారా యువతకు సూచనలు తెలియజేశారు. డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వర రావు,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాట్లాడుతూ విశ్రాంత అధ్యాపకుడు తెలుగు భాష పై నేటి యువతకు అవగాహన కలిగించాలని, ప్రతి అంశంలోనూ తెలుగుకు ఉన్న ఆవశ్యకత గురించి క్షుణ్ణంగా వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఉపన్యాసం చేసారు . తెలుగుజాతి సముద్ధరణకు కళాశాల ఉపాధ్యాయులే కాక తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లలకు తెలుగు సాహిత్యం పై పూర్తి అవగాహన ఏర్పరవలసిన అవసరాన్ని గుర్తు చేశారు. సభాధ్యక్షులు మునిరత్నం నాయుడు మాట్లాడుతూ, తెలుగు విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి దిశగా కృషి జరుగుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తెలుగు విశ్వవిద్యాలయం ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తెలుగు బాషా కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే విశ్వవిద్యాలయం యువతరానికి ఉపయుక్తమవుతుందని తెలియజేశారు ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానం గావించారు. తదనంతరం 'రాకా' సాంస్కృతిక సంస్థ సిటీ ప్రధాన కార్యదర్శి జి.వి. రమణ, కోశాధికారి సూరపురెడ్డి తాతారావు లు తెలుగు తల్లి జ్ఞాపికతో వైస్ ఛాన్సలర్ మునిరత్నం నాయుడుని సత్కరించడం జరిగింది. తదనంతరం వందన సమర్పణ తో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ముగిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రామనామ స్మరణ చేపట్టాలి



**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిత్యం రామనామ స్మరణ చేపట్టాలని విజయవాడకు చెందిన శ్రీ శ్రీ శ్రీ దండి అష్టాక్షరి బృందావన రామానుజ జీయర్ స్వామి పిలుపునిచ్చారు. శనివారం పోలవరం జిల్లా పర్యటనలో భాగంగా గంగవరంలోని అభయాంజనేయ స్వామి దేవాలయమును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామీజీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామి ని దర్శించుకుని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. హిందూ ధర్మ పరిరక్షణ నిమిత్తం ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. రామనామ జపం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు . నిత్యం దేవాలయాల్లో భజన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు రాట్నాల సూర్య, డివిడి ప్రసాద్, గుడ్ల అంక శ్రీనివాస్ రెడ్డి, బుల్లి కొండలు, వై ఆర్ కె ప్రసాద్, స్థానికులు వెంకటరమణ, నాగూరయ్య, రమణమ్మ, సుశీల, సత్యవతి తదితరులు ఉన్నారు.

## ధారకొండగుర్తేడు ప్రాంతాల్లో ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి పర్యటన

ఆరోగ్య, వైద్య సేవల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని హామీ





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**
రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి శనివారం ధారకొండగుర్తేడు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ధారకొండలోని దారాలమ్మ అమ్మవారిని కూటమి నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు పలు ప్రభుత్వ సంస్థలను సందర్శించారు.ధారకొండ ప్రభుత్వ పాఠశాల, ధారకొండ ప్రభుత్వ ఆసుపత్రి, గుమ్మిరేవుల సచివాలయం, పాతకోట సచివాలయాలను పరిశీలించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకుని, లోటుపాట్లను గుర్తించారు.తదుపరి గుర్తేడు మండలంలో గుర్తేడు ప్రభుత్వ ఆసుపత్రి, గుర్తేడు పాఠశాలను సందర్శించారు. గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై స్థానిక నాయకులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు.ముఖ్యంగా వైద్యుల కొరత, సదుపాయాల లోపం వంటి అంశాలను వివరించారు.ఈ సందర్భంగా చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి మాట్లాడుతూ, గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ పర్యటనలో గుర్తేడు మండల జనసేన యువత అధ్యక్షుడు గొర్లె చిరంజీవి, బీజేపీ నాయకుడు కొండ్ల విజయ్, టీడీపీ నాయకుడు కొండ్ల శివశంకర్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి-ఇంచార్జ్ సువర్ణ రాజు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 21.** నియోజకవర్గ పరిధిలో ఉన్న దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సహకారంతో కృషి చేస్తున్నట్లు జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. నల్లజర్ల మండలం సుభద్ర పాలెం గ్రామంలో ఒక మహిళకు సంబంధించిన భూమి సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. అంతేగాక క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడానికి సువర్ణ రాజు జనసేన నాయకులు, స్థానిక గ్రామ రెవెన్యూ అధికారితో కలిసి వెళ్లారు. అక్కడ పరిస్థితిని గమనించారు. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను బాధితుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు తెలిపారు. అలాగే సుభద్ర పాలెం గ్రామంలో రహదారి ప్రమాదం కారణంగా అనారోగ్యం గురైన చవ్వాకుల భవాని శంకరం ను పరామర్శించి ఓదార్చారు. బాధిత వికలాంగుడికి ప్రభుత్వం తరుపున వచ్చే సహాయాన్ని అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జనసేనమండల పార్టీ అధ్యక్షులు చోడ సాని బాపిరాజు, కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, స్థానిక పార్టీ అధ్యక్షులు చిల్లశేఖర్, ఐటీ కోఆర్డినేటర్ ఉన్నమట్ల సత్య కిరణ్, వేనిగంట వినయ్ తదితరులు ఉన్నారు.

# శాసనమండలిలో వైసిపి సభ్యుల తీరు బాధాకరం

### హిందువుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా వైసిపి ఎమ్మెల్సీల ప్రవర్తన



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 21 :**శాసనమండలిలో వైసిపి మండలి సభ్యుల తీరును తీవ్రంగా ఖండించిన గూడెం కూటమి నాయకులు శనివారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ఎన్నుకోబడిన నేతలు హుందాగా వ్యవహరించాలని అన్నారు ప్రజా సమస్యలపై రాష్ట్ర అభివృద్ధి కొరకు పోరాడాలని పిలుపునిచ్చారు అంతేకాని సాక్షాత్తు తిరుమల వెంకటేశ్వర స్వామి వారి ఫోటోలు తో శాసన మండలిలో వారి తీరు సరిగా లేదని హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించారన్నారు చెప్పులు వేసుకుని వెంకటేశ్వర స్వామి వారి ఫోటోలను ప్లకార్డుల గా ఉపయోగించడం చాలా దురదృష్టకరమన్నారు లడ్డూ లో కలిపే నెయ్యి కల్తీ జరిగిందని నివేదికలు బయటపెట్టిన వారు తీరు మాత్రం మారటం లేదన్నారు గత వైసీపీ ప్రభుత్వంలో శ్రీరాముడు విగ్రహం శిరక్షేధం జరిగితే పట్టించు కోలేదన్నారు అంతర్వేది లో రథం తగలబడేతే ఆ విషయాన్ని సరిగా పట్టించు కోలేదన్నారు మీ వైఖరినీ చూసి ప్రజలు తిట్టుకొంటున్నారన్నారు హిందువుల మనోభావాలను దెబ్బ తియ్యటమే మీ వైఖరి గా కనపడుతుందన్నారు ఇలాంటి వైసిపి వ్యక్తులకు మండలిలో సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు వత్తనపల్లి కాశి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్ బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ నర్సి సోమేశ్వరరావు బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీను, పుల్లా బాబి, చాపల రమేష్, పెంటపాడు ఎంపీపీ వెంకటలక్ష్మి, కిలపర్తి వెంకట్రావు, సుబ్బరాజు, జగన్నాథరాజు, ఎరుబండి సతీష్, సజ్జసుబ్బు, పట్నాల రాంపండు, పసల కొండ కూటమి తదితరులు పాల్గొన్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జగన్ డైరెక్షన్ లోనే మండలిలో వైసిపి సభ్యుల అరాచకం

### 32మందికి సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వాసు



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఫిబ్రవరి 21**
దేవుళ్లను రాజకీయాలలోకి లాగడం దారుణం అని, అధికారంలో ఉన్నపుడు, అధికారం లేనపుడు కూడా వైసిపి తీరు , అరాచకమేనని అదే తంతు కొనసాగుతోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక జెఎన్ రోడ్డులోని వి కన్వెషన్ హాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ డిక్లరేషన్ ఇచ్చి దర్శనానికి వెళ్లాలనే నిబంధన ఉన్నప్పటికీ వైసిపి పాటించకపోవడం గతంలో చూశామని గుర్తుచేశారు. పెద్దల సభగా పిలిచే శాసనమండలిలో చెప్పులు వేసుకుని దేవాదేవుని చిత్రపటాలతో వైసిపి వాళ్ళు చేసిన అరాచకం చూసి, ఆంధ్రప్రదేశ్ ప్రజలు, వేంకటేశ్వర స్వామి భక్తులు విస్మయానికి గురయ్యారని ఎమ్మెల్యే వాసు అన్నారు.

శాసన మండలిలో అరాచకం చేస్తారు తప్ప శాసనసభకు ఎన్నికైన 11మందిని సభకు మాత్రం ఎందుకు పంపించడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించడం మానేసి, శాసనమండలిలో రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో టిడిపికి 23సీట్లు వస్తే సభకు హాజరుకావడం మానలేదని ఆయన అన్నారు. వైసిపి వాళ్ళు గవర్నర్ ప్రసంగాన్ని వినకుండా కాగితాలు చించేసి పడేయడం సభ మర్యాద కాదన్నారు. గతంలో స్పోర్ట్స్ మెటీరియల్ మీద, చిక్కీల మీద, పుస్తకాల మీద కూడా వైసిపి స్టికర్లు వేసుకున్నారని విమర్శించారు. తీరు మారకపోతే వచ్చే ఎన్నికల్లో 11సీట్లు కూడా రావన్నారు.

సిఎమ్ ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ :
ఈసందర్భంగా 36 మందికి రూ 21,44,748 విలువైన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను, 4 ఎల్ ఓ సి లను ఎమ్మెల్యే వాసు అందజేశారు. ఇప్పటివరకు 445 మందికి 3,93,48,952 రూపాయల చెక్కులను అందజేశామని ఆయన తెలిపారు. ఇంకా 108 మందికి రూ 3,84,47,201 లు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. వైసిపి హయాంలో ఒక్కరికైనా సీఎం ఆర్ ఎఫ్ కింద సాయం చేయాలేదన్నారు. ఈ మీడియా సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాలతో వైసీపీ నీచ రాజకీయాలు



రూరల్ శాసన సభ్యులు గోరంట్ల విమర్శ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 21:** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని నినాదాలు చేస్తూ రాజకీయం చేసే నీచానికి వైసిపి వాళ్ళు దిగజారారని గ్రామీణ శాసన సభ్యులు, టిడిపి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి పథకం ప్రకారం డైరెక్షన్ లోనే జరిగిందని ఆయన ఆన్నారు. శాసన మండలిలో వైసిపి సభ్యుల వికృతాలపై ఎమ్మెల్యే గోరంట్ల ఘాటుగా స్పందిస్తూ, జగన్ రెడ్డి హిందువుల మనోభావాలంటే లెక్కేలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతుల కేంద్రాలుగా మార్చారని, ఇప్పుడు దేవుడి ఫొటోలతో నీచ రాజకీయాలు చేస్తున్నారని గోరంట్ల విమర్శించారు. హిందూమత విశ్వాసాల పట్ల, తిరుమల దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పట్ల జగన రెడ్డికి చిన్నచూపు ఉందన్నారు. పరమపవిత్రమైన దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు,రసాయనాలతో కల్తీ చేసారని, శ్రీవారి పరకామణిలో విదేశీ కరెన్సీని కొల్లగొట్టిన కేసులో నిందితుడు తో రాజీ చేసుకుని అతని ఆస్తులను టీటీడీ పేరిట రాయించి దొంగలకు మద్దతు గా జగన్ రెడ్డి నిలిచాడని విమర్శించారు. శ్రీవారి ఆలయంలో జగన్ పిన్నిచేత 'జగన్ రెడ్డి రక్షక గోవింద' అని పొగిడించుకుని శ్రీవారిని అవమానించి హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీశారని గోరంట్ల ధ్వజమెత్తారు. తిరుమల మాడవీధుల్లో చెప్పులతో జగన్ తిరిగారన్నారు. రూ.2 కోట్ల విలువైన తలనీలాలను చైనాకు అక్రమంగా తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పట్టుకోవడమే ఉదాహరణ అన్నారు. వందలాది హిందూదేవాలయాలపై జగన్ పాలనలో దాడులు దౌర్జన్యాలు జరిగాయన్నారు. దోషులను శిక్షించకుండా , ఈ ఘటనలు ఖండిచ కుండా ఐదేళ్లు జగన్ రెడ్డి హిందూ వ్యతిరేక విధానాలు కొనసాగించాడని ఆయన ఎద్దేవా చేసారు. స్వామివారికి సతీసమేతంగా జగన్ సతీసమేతంగా పట్టువస్త్రాలు ఇవ్వకుండా హిందూ సంప్రదాయాలను కాలరాయడాన్ని ఎమ్మెల్యే గోరంట్ల గుర్తుచేశారు. వైసిపి హయాంలో దేవదేవుడితో ఆటలు ఆడడం వలన 11 సీట్లకు పడిపోయాడని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. అయినా బుద్ధి రాలేదని, చేసిన తప్పులకు దేవుడిని క్షమాపణ వేడుకోకపోతే, భవిష్యత్తులో 11సీట్లు కూడా రావని ఆయన పేర్కొన్నారు

## మండల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు...

### 303 మంది ఉపాధ్యాయుల్లో 280 మంది హాజరు 10వ తరగతి ఫలితాలపై దృష్టి...




**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి21:** అడ్డతీగల మండలంలో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఆశ్రమ హై స్కూల్ డి.భీమవరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడ్డతీగల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లవరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపల్లి పాఠశాలల్లో ఈ సమావేశాలు నిర్వహించారు.మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు సమావేశాలకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 303 మంది ఉపాధ్యాయుల్లో 280 మంది హాజరైనట్లువెల్లడించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా, అర్థవంతంగా బోధించేందుకు ఈశిక్షణఉపయోగపడుతుందని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు . యఫ్. ఏ. యస్. ఏ. పరీక్షలలో వచ్చిన మార్పులను ఆధారంగా తీసుకుని వెనుకబడిన సి. డి., గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలన్నారు. అలాగే జి.- ఎఫ్. యల్. యన్.విధానాన్ని అనుసరించి విద్యార్థులను గ్రేడింగ్ చేయడం జరుగుతుందని వివరించారు. ఈవిద్యాసంవత్సరంలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలనిఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పల్లాల. బాలు రెడ్డి, సీఆర్పీలు వాసు, కె. అబ్బాయి రెడ్డి, బాలరాజు, తేజరావు, నూకరాజు, అడపా. రామారావు, బాల రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు





కాజులూరు మండల మాలమహానాడు డిమాండ్

**కాజులూరు, పెన్ పవర్,ఫిబ్రవరి 21:**ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలు బి.ఆర్. అంబేద్కర్ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఆయనపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని కాజులూరు మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం. మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.వినతిపత్రంలో అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అమూల్యమని, సమానత్వం,సామాజిక న్యాయం, రిజర్వేషన్లు,మహిళా హక్కుల సాధనలో ఆయన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఇటీవలి వ్యాఖ్యలు దళిత వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని తెలిపారు.ఇలాంటి వ్యాఖ్యలు వర్గాల మధ్య ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్ర మంలో భీమ్ రావ్ రాంజీ సంక్షేమ సంఘం నాయకులు, మండల మాలమహానాడు నాయకులు, వినతి పత్రం సమర్పణ అనంతరం "జోహార్ డాక్టర్ అంబేద్కర్" అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమం లో కాజులూరు భీమ్ రావ్ రాంజీ సంక్షేమ సంఘం నాయకులు నెల్లి బ్రహ్మాజీ, కూటి రంజిత్ కుమార్, అలాగే మాలమహానాడు నాయకులు గొల్ల పాలెం మాజీ సర్పంచ్ పోతురాజు బాబూరావు,పోతు శ్రీను మాస్టారు, రొక్కాల సత్తిబాబు, నిమ్మితి విజయ్, మాజీ ఎంపీటీసీ రాగం పోలరాజు,రంపాల రాజు,గుదే శ్రీనివాస్, ఊడా నాని,ఊడ అజయ్,నాగాబత్తుల పావన మూర్తి,పి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 6 ఏళ్ల తర్వాత తన రికార్డును తానే బ్రేక్ చేసుకున్న స్మృతి మంధాన..



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన మరోసారి తన క్లాస్ బ్యాటింగ్ చూపించింది. ఈరోజు (ఫిబ్రవరి 21) అడిలైడ్ లోని ఓవల్ మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో చెలరేగిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 176/6 అనే స్కోర్ చేయడంలో మంధాన కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. రెండో వికెట్‌కు జెమిమాహ్ రోడ్రిగస్ తో కలిసి 82 బంతుల్లో 121 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జెమిమా (59) సైతం హాఫ్ సెంచరీ చేసింది.

ఈ ఇన్నింగ్స్‌తో స్మృతి మంధాన తన కెరీర్‌లో 33వ టీ20 అంతర్జాతీయ అర్ధశతకం నమోదు చేసుకుంది. అంతేకాదు, ఆస్ట్రేలియాలో భారత బ్యాటర్‌గా అత్యధిక వ్యక్తిగత స్కోర్ చేసిన ప్లేయర్ గా ఆరేళ్ల రికార్డును కూడా చెరిపేసింది. గతంలో ఆమె 2020లో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో 37 బంతుల్లో 66 రన్స్ చేసింది. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి నయా చరిత్ర సృష్టించింది. ఇదే సమయంలో, ఆస్ట్రేలియాపై మంధానకు ఇది 8వ 50 ప్లస్ స్కోర్ కావడం విశేషం. ఈ విషయంలో కూడా ఆమె టీమిండియా బ్యాటర్‌గా నెంబర్ స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా తో జరిగిన మ్యాచ్ ప్రారంభంలో నాలుగో బంతికి బౌండరీతో ఖాతా తెరిచిన స్మృతి, మూడో ఓవర్‌లో షఫాలి వర్మ (7) వికెట్ పడిన తర్వాత పవర్‌ప్లే చివరి ఓవర్ వేసిన సోఫీ మోలినెక్స్ బౌలింగ్ లో మంధాన 3 ఫోర్లు కొట్టి బ్యాటింగ్ లో వేగం పెంచింది. జస్ట్ 38 బంతుల్లో

హాఫ్ సెంచరీ పూర్తి చేసిన ఆమె, ఆ తర్వాత గేర్ మార్చి సెంచరీ దిశగా దూసుకెళ్లింది. చివరకు అన్నాబెల్ సదర్లాండ్ బౌలింగ్‌లో డీప్ మిడ్‌వికెట్ వద్ద క్యాచ్ ఇచ్చి అవుట్ అయింది. ఇక మంధాన – జెమిమా భాగస్వామ్యంతో భారత్ ఈ కీలక మ్యాచ్‌లో భారీ స్కోర్ సాధించగలిగింది.

# భారత్ ఘన విజయం.. 2-1 తేడాతో ఆస్ట్రేలియాపై సిరీస్ కైవసం



**హైదరాబాద్ పెన్ పవర్:** అడిలైడ్ లోని ఓవల్ స్టేడియంలో జరిగిన 3వ ౹20లో భారత్-- ఆస్ట్రేలియా జట్లు తలపడ్డాయి. నిర్ణయాత్మకమైన మ్యాచ్ లో 17 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించి.. దీంతో సిరీస్ ని భారత్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బ్యాటింగ్ తీసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో భారత మహిళల జట్టు 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. టీమిండియా బ్యాటర్లలో స్మృతి మంధాన (55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులు) హాఫ్ సెంచరీ చేయగా, జెమిమా రోడ్రిగ్స్ (59) కూడా అర్ధ శతకంలో టీం భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్లో 177 పరుగుల టార్గెట్ తో బరిలో దిగిన ఆస్ట్రేలియాను 159/9 పరుగులకే టీమిండియా బౌలర్లు పరిమితం చేశారు. ఆష్లీ గార్డనర్ 57 హాఫ్ సెంచరీ చేయగా, లిచ్ఫీల్డ్ 26 దూకుడుగా ఆడినప్పటికీ ఆసీస్ ను మాత్రం గెలిపించడంలో విఫలమయ్యారు. వీరు ఇద్దరు మినహా మిగతా అందరూ బ్యాటర్లు తక్కువ పరుగులకే ఔట్ కావడంతో భారత్ ఈజీగా విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో శ్రీచరణి, శ్రేయాంక తలో 3 వికెట్లు, అరుంధతి రెడ్డి 2 వికెట్లు, రేణుక సింగ్ ఒక వికెట్ తీసుకుంది. ఆస్ట్రేలియా మహిళల జట్టుపై భారత్ ఘన విజయం సాధించడంతో పాటు ఈ సిరీస్ ని కైవసం చేసుకుంది. దీంతో ఆసీస్ గడ్డపై భారత్ మహిళల జట్టుకు ఇదే తొలి సిరీస్ విజయం. మ్యాచ్ అనంతరం భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. ఈ సిరీస్ విజయంపై ఆనందంగా ఉంది. ఈ విజయం మాకు చాలా ప్రత్యేకమైనది.. ఇది పూర్తిగా టీమ్ ఎఫర్ట్.. ప్రతి ఒక్కరూ జట్టుకు ఏదో ఒక విధంగా సహకరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపింది. జెమిమా రోడ్రిగ్స్, స్మృతి మంధాన భాగస్వామ్యంపై సరైన సమయంలో వచ్చింది.. వారు ఇద్దరు జట్టుకు వారు పెద్ద బలంగా మారారు అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. ఇక మేం వికెట్లు తీసినప్పుడే మ్యాచ్ మన వైపు తిరుగుతుంది.. ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టు వికెట్లు తీయడం అంత సులభం కాదు.. కానీ మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి వికెట్ల పడగొట్టడంతో ఈ మ్యాచ్ గెలిచామని వెల్లడించింది. భారత్ చేతిలో ఓటమిపై ఆస్ట్రేలియా కెప్టెన్ సోఫీ మోలినెక్స్ మాట్లాడుతూ.. మంచి వికెట్‌పై టీమిండియాను కట్టడి చేశాం.. కానీ కీలక సమయంలో వికెట్లు కోల్పోవడమే మాకు తీవ్ర నష్టం కలిగించిందని తెలిపింది. పెర్రీ కోసం ఈ మ్యాచ్ గెలవలేకపోయినందుకు కొంచెం బాధగా ఉంది.. ఆమె మాకు అందరికీ పెద్ద ఇన్స్పిరేషన్.. ఆమె మరెన్నో మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటున్నాం పేర్కొనింది. వచ్చే వన్డే సిరీస్‌లో అలీసా హీలీ జట్టులోకి రావడం మాకు పెద్ద ప్లస్ అవుతుంది.. ఆ సిరీస్‌లో పరిస్థితిని మార్చేందుకు మా వంతు ప్రయత్నం చేస్తామని సోఫీ మోలినెక్స్ చెప్పుకొచ్చింది.

# అభిషేక్ శర్మ ఫామ్ గురించి టెన్షన్ వద్దు.. సూర్యకుమార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026లో అభిషేక్ శర్మ టాప్ రన్‌గెటర్‌గా నిలుస్తాడని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేశారు. కానీ టోర్నీ ఆరంభంలోనే అభిషేక్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో అతని ఫామ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలపై భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గట్టిగా స్పందించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన స్కై, అభిషేక్ ప్రస్తుత ఫామ్ తనను ఏమాత్రం ఆందోళనకు గురి చేయడం లేదని స్పష్టం చేశాడు. అంతేకాదు, అతడిపై విమర్శలు చేసే వారిపైనే తనకు ఎక్కువ టెన్షన్‌గా ఉందని పేర్కొన్నాడు. అభిషేక్ శర్మ గురించి ఆందోళన చెందుతున్న వాళ్ల గురించి నేనే ఎక్కువగా ఆందోళన పడుతున్నాను అని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. అతడు తర్వాత ఆడే జట్ల పరిస్థితి ఏంటో ఆలోచించాలి అని పేర్కొన్నాడు. గత ఏడాది అభిషేక్ జట్టు కోసం అన్నీ చేశాడు.. ఇప్పుడు మేము అతడికి మద్దతుగా నిలిచే సమయం వచ్చింది అని స్పష్టం చేశాడు. కాగా అభిషేక్ శర్మ సామర్థ్యంపై పూర్తి నమ్మకం ఉంది.. అతడు త్వరలోనే తన గత ఫామ్‌ను తిరిగి అందుకుంటాడని స్కై భాయ్ ధీమా వ్యక్తం చేశాడు. అదే సమయంలో సూర్యకుమార్ మాటలు ప్రత్యర్థి జట్లకు ఇది ఒక హెచ్చరికగా మారిందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అభిషేక్ ఒక్కసారి ఫామ్‌లోకి వస్తే, ప్రత్యర్థి బౌలర్లకు కష్టకాలమేనన్న సందేశాన్ని సూర్య వ్యాఖ్యలతో క్లియర్ గా తెలిసిపోతుంది. వరుసగా విఫలమైతున్నప్పటికీ అభిషేక్ శర్మకు తుది జట్టులో స్థానం కొనసాగుతుందని బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ తెలిపారు. జట్టు మేనేజ్‌మెంట్‌లో అభిషేక్ ప్రదర్శనపై ఎలాంటి చర్చే జరగడం లేదని స్పష్టం చేశారు. అతను వరల్డ్ క్లాస్ ప్లేయర్, ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఇతర ఆటగాళ్లు బాధ్యత తీసుకుని నిలబడ్డారు.. ఇప్పుడు వరల్డ్ కప్‌లో చాలా కీలక దశకు చేరుకున్నాం.. ఈ సమయంలో అభిషేక్ తప్పకుండా రాణిస్తాడనే నమ్మకం మాకు ఉందని మోర్నీ మోర్కెల్ ధీమా వ్యక్తం చేశాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్--8 దశలో భాగంగా రేపు (ఫిబ్రవరి 22న) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.



## ప్రగ్యా జైస్వాల్: ఎ విజన్ ఇన్ గోల్డెన్ గ్లో

# సిద్ధు, నవీన్‌ల దారిలో రామ్...!



ఎనర్జిటిక్ స్టార్ రామ్ గత కొన్నాళ్లుగా సక్సెస్ కోసం చేయని ప్రయత్నం లేదు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత ఆ స్థాయి విజయం రామ్ చూడలేదు. గత నాలుగు ఐదేళ్లుగా రామ్ చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద వర్కౌట్ కావడం లేదు. గత ఏడాది 'ఆంధ్రా కింగ్ తాలూక' సినిమాతో రామ్ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. రివ్యూలు కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి. రామ్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. దర్శకుడి యొక్క పనితనం కి కూడా మంచి మార్కులు పడ్డాయి. స్క్రీన్ ప్లే బాగుందని అంతా మెచ్చుకున్నారు. కానీ సినిమాకు కలెక్షన్స్ మాత్రం రాలేదు. చాలా మంది ఓటీటీలో సినిమాను చూసి వావ్ అన్నారు కానీ, థియేట్రికల్ రన్ సమయంలో మాత్రం అటువైపు వెళ్లలేదు. సినిమాకు ఎంత పాజిటివ్ రెస్పాన్స్ వచ్చినా ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేద్దాం అన్నట్లుగానే ఉన్నారు.

**రామ్ ఆంధ్రా కింగ్ తాలూక సినిమా...**

ఆంధ్రా కింగ్ తాలూక సినిమా తర్వాత రామ్ సన్నిహితుల వద్ద చాలా ఆవేదన వ్యక్తం చేశాడని ఇండస్ట్రీ వర్గాల టాక్. ఆ సినిమా తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న రామ్ తిరిగి కొత్త సినిమా పనిలో పడ్డట్లుగా తెలుస్తోంది. ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం తనకు నమ్మకస్తుడు అయిన దర్శకుడు కిషోర్ తిరుమల వద్ద రామ్ ఒక కథను తీసుకున్నాడట. ఆ కథ తో పాటు మరో కథను రామ్ ఇప్పుడు డెవలప్ చేసే పనిలో ఉన్నాడు. రెండు కథల పై వర్క్ జరుగుతోంది. రామ్ కి ఒక రైటింగ్ టీమ్ ఉంటుంది. ఆ టీమ్ ఇప్పుడు ఆ రెండు కథలను ఫైనల్ చేసే విధంగా సిట్టింగ్స్ లో ఉన్నారు. ఇక్కడ చెప్పుకోవద్ద విషయం ఏంటంటే కథ చర్చల్లో రామ్ ప్రధానంగా పాల్గొంటున్నాడు. అధికారికంగా ఈ సినిమా కు రామ్ రైటర్ గా వ్యవహరించబోతున్నట్లుగా ఆయన సన్నిహితులు, మీడియా సర్కిల్స్ వారి ద్వారా సమాచారం అందుతోంది.

**సిద్దుజొన్నలగడ్డ, నవీన్ పొలిశెట్టి....**

ఇప్పటికే నవీన్ పొలిశెట్టి, సిద్దు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోలు కథ విషయంలో చాలా ఇన్వాల్వ్ అవుతారు. అంతే కాకుండా రైటింగ్ విషయంలో ఇద్దరు హీరోలు పూర్తి ఇన్వాల్వ్‌మెంట్ అవుతారని టాక్ ఉంది. టైటిల్ కార్డ్ పడకున్నా దర్శకత్వం సైతం ఈ హీరోలు చేస్తారు అనే టాక్ ఉంది. ఆ విషయం పక్కన పెడితే ఇప్పుడు రామ్ కూడా రైటింగ్ పై పూర్తి ఫోకస్ పెట్టాడని తెలుస్తోంది. చాలా సినిమాలు చేసిన అనుభవం ఉన్న రామ్ కి రైటింగ్ పై పట్టు ఉండటం చాలా కామన్ విషయం. అయితే పూర్తి ఇన్వాల్వ్‌మెంట్‌తో రైటింగ్ పై దృష్టి పెట్టడం ఎంతవరకు సాధ్యం అని కొందరు భావిస్తున్నారు. సినిమా షూటింగ్‌కి ముందు స్క్రిప్ట్ విషయంలో రామ్ ఇన్వాల్వ్‌మెంట్ ఉంటే మేకింగ్ సమయంలోనూ ఆయన ఇన్వాల్వ్‌మెంట్ ఉండే అవకాశం ఉంటుందని కొందరు అంటున్నారు. ఇప్పటి వరకు రామ్ తదుపరి సినిమా దర్శకుడు ఎవరు అనే విషయం లో క్లారిటీ రాలేదు.

**రామ్ నిర్మాణంలో కొత్త సినిమా...**

నవీన్, సిద్దు సినిమాలకు దర్శకులు కొత్త వారు పని చేస్తారు. దాంతో వీరి ఇన్వాల్వ్‌మెంట్ ఎక్కువగా ఉంటుందని అంటారు. అందుకే రామ్ సైతం తన తదుపరి సినిమాకి కొత్త దర్శకుడిని తీసుకుంటే అన్ని విధాలుగా బాగుంటుంది అనేది ఆయన కాంపౌండ్ ఆలోచనగా తెలుస్తోంది. కేవలం రైటింగ్ విషయంలోనే కాకుండా నిర్మాణంలోనూ రామ్ పాత్ర ఉండే అవకాశాలు ఉన్నాయి. తన సొంత బ్యానర్‌లో రామ్ ఈ సినిమాను నిర్మించే యోచన చేస్తున్నాడని తెలుస్తోంది. స్క్రిప్ట్ ఫైనల్ అయ్యాక నిర్మాతలు ఎవరూ సెట్ కాకుంటే అప్పుడు రామ్ సొంతంగా రంగంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. మొత్తానికి రామ్ ఈసారి సొంత ప్రయోగం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరి ఈ ప్రయోగం ఎంతవరకు సఫలం అవుతుంది అనేది చూడాలి. రామ్ గత చిత్రాల ఫలితాలు కచ్చితంగా రాబోయే సినిమాపై ఉంటుంది. దాన్ని అధిగమించే విధంగా ఈ సినిమా ఉండాలి అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.



## నేహా శర్మ యొక్క బ్లాక్ మ్యాజిక్: స్వచ్ఛమైన చక్కదనం యొక్క విజన్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965